https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 58 గురువారం 8-5-2025 పేజీలు : 4 వెల : 2 రూ/..

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.
సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.



# సిందూరమే.. సంహారమై

## 80 మంది ఉగ్రవాదుల్ని మట్టుబెట్టిన భారత్?

'చున్ చున్ కే మారేంగే (ఏరి ఏరి మరీ చంపుతాం).. 'షోలే' సినిమాలో ధర్మేంద్ర డైలాగ్ ఇది! పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారం తీర్చుకుంటామంటూ కొద్ది రోజుల కిందట కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ఇదే చెప్పారు! ఆయన అన్నట్లుగానే.. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఏరి ఏరి మరీ లష్కరే తాయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్ర స్థావరాలు, ప్రధాన కార్యాలయాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేసింది! సరిహద్దు దాటకుండానే.. క్షిపణులు, బాంబుల వర్షం కురిపించింది! ఉగ్ర శిబిరాలు, స్థావరాలను నేలమట్టం చేసింది! కరుడుగట్టిన ఉగ్రవాది మసూద్ అజహర్‌ను మళ్లీ కోలుకోలేకుండా చావు దెబ్బ కొట్టింది! 'దాడుల్లో నేను కూడా చచ్చిపోతే బాగుండు' అని అతడు అన్నాడంటే వాటి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు! నిజానికి, బుధవారం సాయంత్రం దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్ ఉంటుందని ప్రకటించారు కానీ.. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాతే అసలైన ప్రతీకారానికి శ్రీకారం చుట్టేశారు! ఈ దాడులకు భారత సైన్యం పెట్టిన పేరు 'ఆపరేషన్ సిందూర్'! పహల్గాంలో భార్యల కళ్లెదుటే భర్తలను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపి.. వారి సిందూరాలను ఉగ్రవాదులు రక్తంతో తుడిచేసిన సంగతి తెలిసిందే! తమ భర్తతోపాటు తమనూ చంపేయాలని ప్రాధేయపడితే.. 'వెళ్లి మోదీకి చెప్పుకో పో' అంటూ వదిలేశారు! అప్పట్లో చెరిగిపోయిన వారి సిందూరమే ఇప్పుడు మృత్యు క్షిపణిగా మారి ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడింది! వాళ్లు వెళ్లి మోదీకి చెప్పలేదు కానీ.. మోదీ రణ గర్జన ప్రపంచమంతా ప్రతిధ్వనించింది! గతానికి భిన్నంగా వీడియోలు, ఫొటోలు, సైనిక ఫుటేజీల రూపంలో తమ ప్రతీకార దాడుల తీవ్రత ప్రపంచం మొత్తానికి తెలిసేలా భారత్ చేసింది.

- పహల్గాంకు ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్'
- పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపై భారత్ క్షిపణి దాడులు
- లష్కరే తాయిబా, జైషే మహ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ ప్రధాన కార్యాలయాలు
- సహా ఉగ్ర శిబిరాలు నేలమట్టం
- వీటిలోనే కసబ్, డేవిడ్ హెడ్లీ తదితరులకు ఉగ్ర శిక్షణ
- వాటి శిక్షణ, కమ్యూనికేషన్, మౌలిక సదుపాయాలన్నీ ధ్వంసం
- మృతుల్లో మసూద్ అజహర్ కుటుంబ సభ్యులు, అనుచరులు
- మరిన్ని దాడుల్ని అడ్డుకోవడానికే సైనిక చర్య: విక్రమ్ మిస్రీ

అనుంగు అనుచరులు మరో నలుగురు ఉండడం గమనార్హం. 'ఆపరేషన్ సిందూర్' పేరిట మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దాడులకు భారత సైన్యం శ్రీకారం చుట్టింది. దాదాపు 1.05 గంటల నుంచి 1.30 గంటల వరకూ అంటే.. 25 నిమిషాలపాటు ఈ ఆపరేషన్ కొనసాగింది. లష్కరే తాయిబా ఆత్మాహుతి బాంబర్ల కీలక శిక్షణ శిబిరమైన కోట్లీలోని అబ్బాస్ టెర్రరిస్టు క్యాంపుపై రాత్రి 1.04 గంటలకు తొలుత క్షిపణి దాడి చేసింది. ఏ సమయంలోనైనా ఇక్కడ 50 మందికిపైగా ఉగ్రవాదులు ఉంటారని చెబుతారు. ఆ వెంటనే, లష్కరే తాయిబా ప్రధాన కార్యాలయం, అతి పెద్ద ఉగ్రవాద శిక్షణ శిబిరమైన మురుడ్కేలోని స్థావరంపై 1.06 గంటల నుంచి 1.10 గంటల వరకూ వరుస దాడులు చేసి పూర్తిస్థాయిలో ధ్వంసం చేశారు. ఆ తర్వాత.. ఉగ్ర ప్రణాళికలు, శిక్షణకు కీలకమైన బహవల్పూర్‌లోని జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయాన్నిబీ సరిహద్దు ఉగ్రవాద చొరబాట్లకు శిక్షణ, సహకారం అందించే సియాల్‌కోట్‌లోని ఉగ్రవాద స్థావరాన్ని నేలమట్టం చేసింది. అనంతరం, ఉగ్ర శిక్షణ, ఆయుధ నిల్వ, చొరబాట్లకు కీలకమైన ముజఫరాబాద్, భింబర్‌బీ చాక్ అమ్రు, గుల్పూర్‌లోని స్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. చివరిగా.. సమీప భవిష్యత్తులోనూ ఉగ్రవాద దాడులు చేయకుండా నిలువరించడమే ధ్యేయంగా మురుడ్కేలోని లష్కరే తాయిబా ప్రత్యామ్నాయ స్థావరాన్ని ధ్వంసం చేసింది. సర్జాల్ జిల్లా తెహ్రా కలాన్‌లోని ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జైషే మహ్మద్ తన కమ్యూనికేషన్ కేంద్రాన్ని రహస్యంగా నిర్వహిస్తోంది. అత్యంత కచ్చితత్వంతో దాడి చేసి దానిని నేలమట్టం చేసింది. జమ్ము కశ్మీరులోకి చొరబడే ఉగ్రవాదులకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేసే హై ఫ్రీక్వెన్సీ కమ్యూనికేషన్ వ్యవస్థ ఇక్కడ ఉంటుంది. దాడుల్లో దానిని మొత్తాన్ని ధ్వంసం చేసింది. మిలటరీ గ్రేడ్ కమ్యూనికేషన్ పరికరాలు, లాంగ్ రేంజ్ అల్ట్రా సెట్లు, డిజిటల్ మొబైల్ రేడియోలు తదితరాలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి.

### కచ్చితంగా.. గురి తప్పకుండా...

ఎక్కడా గురి తప్పకుండా పాకిస్థాన్ ఉగ్ర స్థావరాలపైనే మన సైన్యం దాడులు చేసింది. మిలటరీ స్థావరాలు, పౌరులపై ప్రభావం చూపకుండా అత్యంత కచ్చితత్వంతో ధ్వంసం చేసింది. దాడులు చేసిన అరగంటకే సైన్యం ఈ మేరకు ప్రకటన చేసింది. అనంతరం బుధవారం మధ్యాహ్నం ఆర్మీ కార్ప్స్ సిగ్నల్స్‌కు చెందిన కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో కలిసి విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్‌ను అమలు చేసిన తీరును వివరించారు. తొమ్మిది లక్ష్యాలపై తాము ఎందుకు గురి పెట్టాల్సి వచ్చిందో కల్నల్ సోఫియా ఖురేషీ తెలిపారు. సియాల్‌కోట్‌లోని సర్జల్, మెహమూనా జోయా స్థావరం (హిజ్బుల్), మురుడ్కేలోని మర్కజ్ తాయిబా (లష్కరే), బహవల్పూర్‌లోని మర్కజ్ సుభాన్ అల్లా (జైషే మహ్మద్), పీవోకేలోని సవాయి నాలా, ముజఫరాబాద్‌లో సైద్నా బిలాల్, కోట్లీలోని గుల్పూర్, అబ్బాస్, బింభర్‌లోని బర్నాలా



శిబిరాలను ధ్వంసం చేశామని ఆమె మ్యాప్‌ల ఆధారంగా వివరించారు. సంబంధిత ప్రదేశాల చిత్రాలను విడుదల చేశారు. ఉగ్రవాద శిబిరాల్లోని ఒక శిబిరంలో ముంబై దాడులకు పాల్పడిన అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ శిక్షణ పొందారని తెలిపారు. భారత్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న జైషే, లష్కర్, హిజ్బుల్ ఉగ్రవాదులను నిర్మూలించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఉగ్ర దాడులను నిలువరించడం, భవిష్యత్తులో జరగ కుండా అడ్డుకోవడం అనివార్యంగా మారిందని, అందుకే, బాధ్యతాయుతంగా, తదుపరి ఉద్రిక్తతలకు తావు లేకుండా, దెబ్బకు దెబ్బ అన్న తీరులో దాడులు చేశామని విక్రమ్ మిస్రి వివరించారు.

## సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ సర్వీసు మరో ఏడాది పొడిగింపు



న్యూఢిల్లీ: సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు కేంద్రం పొడిగించింది. కొత్త సీబీఐ డెరెక్టర్ విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని మరో ఏడాది కొనసాగించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నియామకానికి అపాయింట్స్ కమిటీ ఆఫ్ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 1986 కర్ణాటక బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్ సూద్ రెండేళ్ల కాలపరిమితి మే 24వ తేదీతో ముగియాల్సి ఉంది. కొత్త సీబీఐ బాస్ ఎన్నిక కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఈ వారం మొదట్లో ఉన్నత స్థాయి కమిటీ సమావేశం జరిగింది. మోదీ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, సీజేఐ సంజీవ్ ఖన్నా పాల్గొన్నారు. అయితే ఈ సమావేశంలో సీబీఐ కొత్త చీఫ్ విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదు. ప్రవీణ్ సూద్ 1986లో ఐపీఎస్‌లో చేరారు. 1989లో మైసూరులో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత బళ్లారి, రాయచూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా సేవలందించారు. అనంతరం బంగళూరు డీసీపీగా పనిచేశారు. 1999 నుంచి మూడేళ్ల పాటు మారిషస్‌లో డిప్యుటేషన్ మీద పనిచేశారు.

# మోదీ విదేశీ పర్యటనలు వాయిదా..

## నేడు అఖిలపక్షం

ఆపరేషన్ సిందూర్ లో భాగంగా భారత్.. పాకిస్థాన్ పై యుద్ధం చేస్తున్న నేపథ్యంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విదేశీ పర్యటనలు వాయిదా వేసుకున్నారు. క్రొయేషియా, నెదర్లాండ్స్, నార్వే దేశాల పర్యటనను వాయిదా వేసుకున్నారని ప్రభుత్వ సీనియర్ అధికారి తెలిపారు. ఇండియా, పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌పై దాడులు చేసిన కొన్ని గంటల తర్వాత ఈ ప్రకటన వచ్చింది. ఇలా ఉండగా, భారత ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి ఆపరేషన్ సిందూర్ గురించి వివరించారు. భవిష్యత్ లో తీసుకోబోతున్న చర్యలు, యుద్ధానికి సంబంధించిన కీలక సమాచారాన్ని ప్రధాని, రాష్ట్రపతికి వివరించినట్టు తెలుస్తోంది. ఇలా ఉండగా, రేపు మరోమారు అఖిలపక్షం భేటీ కాబోతోంది. యుద్ధం నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ గురించి, భవిష్యత్ లో తీసుకుంటున్న చర్యల గురించి ప్రభుత్వం విపక్షాలకు వివరించనుంది. ఆపరేషన్ సిందూర్ పై రేపు జరిగే అఖిలపక్ష సమావేశం చాలా కీలకం కానుంది. ఉదయం 11గం.లకు పార్లమెంటులో అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది కేంద్రం. ఈ భేటీలో ప్రధాని మోదీ కూడా పాల్గొనే అవకాశం కన్పిస్తోంది. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వివరాలు వెల్లడించారు. పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలో అఖిలపక్ష సమావేశం జరుగుతుంది. ఆపరేషన్ సిందూర్ వివరాలు.. భారత్ పాక్ సరిహద్దుల వద్ద ఉద్రిక్తతలు, సరిహద్దు భద్రత, సైనిక సన్నద్ధత తదితర విషయాలను అఖిలపక్ష నేతలకు కేంద్రం వివరించనుంది.



## సీఎం రేవంత్‌తో స్విస్ రాయబారి భేటీ



**హైదరాబాద్, మే 6:** సీఎం రేవంత్‌రెడ్డిని స్విట్జర్లాండ్ రాయబారి మాయా తిస్సాఫీ మంగళవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. తిస్సాఫీ వెంట సీఎంను కలిసిన వారిలో ఎంపీ రఘువీర్, రీజనల్ పాస్‌పోర్టు అధికారి జొన్నలగడ్డ స్నేహజ, సీఎంఓ అధికారి అజిత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# జేఏసీ డిమాండ్లపై మంత్రివర్గ ఉపసంఘంతో చర్చిస్తాం

### ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులతో అధికారుల కమిటీ

**హైదరాబాద్, మే 7:** ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు లేవనెత్తిన అన్ని డిమాండ్లపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘంతో చర్చిస్తామని నవీన్ మిత్తల్ నేతృత్వంలోని అధికారుల కమిటీ తెలిపింది. మరోసారి సమావేశం ఏర్పాటు చేసి ఉద్యోగుల సమస్యలపై నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు హామీ ఇచ్చింది. ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన త్రిసభ్య కమిటీ బుధవారం సచివాలయంలోని రెవెన్యూ ముఖ్యకార్యదర్శి సమావేశ హాల్‌లో ఉద్యోగ సంఘాలతో సమావేశమైంది. జేఏసీ నుంచి చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావుతోపాటు 29 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఉద్యోగులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చిన 57 డిమాండ్లపై అంశాల వారీగా చర్చించారు. ఉద్యోగుల జేఏసీ పేరుతో రెండు సంఘాలు ఉన్నాయని.. కొంతమంది ప్రభుత్వ పెద్దలు, అధికారుల ప్రోత్సాహంతో లచ్చిరెడ్డి నేతృత్వంలో ఏర్పడిన జేఏసీ.. ఉద్యోగుల మధ్య గందరగోళం సృష్టిస్తోందని మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు కమిటీకి ఫిర్యాదు చేశారని జేఏసీ ప్రచార కన్వీనర్ బి.శ్యామ్ తెలిపారు. ఆ జేఏసీని సమావేశానికి పిలిస్తే తాము హాజరుకాబోమని స్పష్టం చేయడంతో వాళ్లకు ఇచ్చిన సమయాన్ని అధికారుల కమిటీ రద్దు చేసిందని చెప్పారు.



## లబ్ధిదారులకె డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించాలి..

**మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం అందజేసిన మాజీ కౌన్సిలర్లు...**



**రామకృష్ణాపూర్, మే 7, (మన సమాజం):** నిజమైన లబ్ధిదారులను గుర్తించి డబుల్ బెడ్రూం ఇండ్లను కేటాయించాలని క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ రాజుకు మాజీ కౌన్సిలర్లు రామిడి ఉమాదేవి-కుమార్, జిలకర మహేష్ లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల వెల్లడించిన డబుల్ బెడ్రూం ఇండ్లలో అవకతవకలు జరిగాయని, అర్హత లేని వారికి ఇండ్లను కేటాయించారని ఆరోపించారు. నిలువునా నీడ లేనివారికి కేటాయించకుండా ఇండ్లు, జాగా ఉన్నవారికి కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు.తమ వార్డులో చాలామంది ఇండ్లు లేని నిరుపేదలు ఉన్నారని అర్హులైన లబ్ధిదారులపై మరోసారి పున: పరిశీలన చేయాలని కమిషనర్ నీ కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కౌన్సిలర్లతో పాటు వార్డు ప్రజలు ఉన్నారు.



## 10, 11 వ తేదీల్లో వాలీబాల్ పోటీలు..

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి తరలి రానున్న క్రీడాకారులు..**



**రామకృష్ణాపూర్, మే 7, (మన సమాజం):** ఈ నెల 10,11వ తేదీల్లో ఆర్ ఆర్ మెమోరియల్ ఆధ్వర్యంలో ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలను స్థానిక ఠాగూర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్, మున్సిపల్ కమీషనర్ రాజు తెలిపారు. బుధవారం స్టేడియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. యువత చెడు మార్గాలను ఎంచుకోకుండా క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. పట్టణంలో ఉన్నటువంటి పిఇటిలు, సీనియర్ క్రీడాకారుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పోటీల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పోటీలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గాండ్ల సమ్మయ్య, మిట్టపల్లి శ్రీనివాస్, వసుధ హాస్పిటల్ ఛైర్మెన్ ప్రశాంత్, కోఆర్డినేటర్ శివ, టిఈటి లు బెల్లం శ్రీనివాస్, కుమార్, రంజిత్, రాజేశం, రవి, రాంమోహన్ పాల్గొన్నారు.

## 12న మెగా అప్రెంటిస్ మేళా..

**మందమర్రి, మే 07, (మన సమాజం) :**ఈనెల 12వ తేదీన ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ షిప్ మేళ నిర్వహిస్తున్నామని మందమర్రి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్.దేవానంద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో వివిధ ట్రేడ్ లు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ అప్రెంటిస్ షిప్ మేళాకు హాజరు కావొచ్చని ఆయన పేర్కొన్నారు. మందమర్రిలోని ఐటిఐ ప్రాంతంలో నిర్వహించే మేళాలో పాల్గొనే విద్యార్థులు ఒరిజినల్ టెన్త్ మెమో, ఐటిఐ మెమోతో పాటు కుల ధృవీకరణ పత్రం, అప్రెంటిస్ షిప్ రిజిస్ట్రేషన్ నెంబర్, ఎన్ టీసీ రిజిస్ట్రేషన్ నెంబర్, బ్యాంక్ పాసు బుక్కు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని దేవానంద్ సూచించారు. అదేవిధంగా **www.apprenticeship.india.gov.in** వెబ్ సైట్‌లో ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

## అక్రమ కేసులకు భయపడేది లేదు

**ఎల్కతుర్తి, మే 07 :** బిఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం రాజకీయ కక్ష్య సాధింపు చర్యలని ఉమ్మడి వరంగల్ బి ఆర్ ఎస్ లీగల్ సెల్ అధ్యక్షులు గుర్రాల వినోద్ కుమార్ అన్నారు. బుధవారం ఎల్కతుర్తి లో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవాల నేపథ్యంలో ఏప్రిల్ 23న భూమి సేకరణ లో భాగంగా స్థానికుల అనుమతి తోనె భూమి సేకరించినప్పటికి స్థానికుల ను ఇబ్బంది పెట్టి సేకరిస్తున్నారని వర్దన్నపేట ఎమ్మెల్యే అన్నందుకు సోషల్ మీడియా లో ఆయన పై తప్పుడు ప్రచారం చేశారని గడ్డం విష్ణు వర్ధన్ ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ నందు బి.ఆర్.ఎస్ వి నాయకుడు గుగులోతు రాజేశ్వర్ పై అక్రమ కేస్‌లు పెట్టారని వారు ఆరోపించారు.

# పోలీసులపై ప్రెస్ ఒత్తిడి పెరుగుతోంది

## జర్నలిజం పేరుతో హద్దులు మరిచే ప్రయత్నాలు

**విలేకరుల వ్యవహారశైలి పట్ల పెరుగుతున్న విమర్శలు**

తెలంగాణలో ఇటీవల కాలంలో పోలీసులపై కొన్ని మీడియా ప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిడి, జర్నలిజం ప్రాథమిక లక్ష్యాలను డీవీయేట్ చేయడమే కాకుండా, చట్టపరమైన వ్యవస్థల పట్ల ప్రజల్లో అనుమానాలను కలిగిస్తోంది. నేర విచారణలపై తమ దృష్టిని పెడుతూ, కొంతమంది విలేకరులు నేరుగా పోలీస్ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారు. అంతే కాదు, తాము చెప్పిన దానిని పోలీసులు పాటించకపోతే, బ్లాక్‌మెయిల్‌కు కూడా దిగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

**న్యాయ వ్యవస్థ స్థానంలో విలేకరుల తలవంపులు..**

కొన్ని సంఘటనల్లో విలేకరులు నేరస్థులను మీడియా వ్యాసాల ద్వారానే తేల్చేయాలని భావిస్తున్నట్టు కనిపిస్తోంది. పోలీసుల విచారణ పూర్తి కాకముందే, తమకున్న సమాచారాన్ని ఆధారంగా చేసుకుని మీడియా వేదికగా నిర్దోషులను కూడా నిందితులుగా ప్రదర్శించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది న్యాయపరమైన ప్రక్రియను ప్రభావితం చేయడమే కాకుండా, వ్యక్తిగత హక్కులను ఉల్లంఘించడంతో కొంతమంది విలేకరులు తలవంపులు తెస్తున్నాయి.

**పైరవీ ఉదంతంలో మీడియా తీరుపై విమర్శలు**

ఇటీవల ఓ పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన సంఘటన ఇది మరింత స్పష్టంగా చూపుతోంది. ఓ కేసులో పైరవీ నమోదు అయిన వెంటనే, అక్కడికి చేరుకున్న కొన్ని మీడియా ప్రతినిధులు, తాము ఎత్తిన కోణానుసారంగా పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. పోలీసులు విధి నిర్వహణలో చట్టబద్ధంగా వ్యవహరిస్తున్నప్పటికీ, మీడియా ప్రతినిధులు తమ మాట వినకపోతే వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని బెదిరించినట్లు సమాచారం.

**బాధ్యతారహిత పాత్ర పత్రికా విలువలకే ముప్పు**

పత్రికా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ జరుగుతున్న ఈ చర్యలు మీడియా వ్యవస్థపై సమాజంలో నమ్మకాన్ని దెబ్బతీయవచ్చు. "జర్నలిజం ఒక పవిత్ర వృత్తి. ఇది ప్రజలకు వాస్తవాలను అందించేందుకు, అధికారాలను ప్రశ్నించేం దుకు ఉపయోగపడాలి. కానీ అదే నెపంతో బలవంతంగా వ్యవహరించడం బాధ్యతారాహిత్యమే," అని సీనియర్ జర్నలిస్టు శ్రీధర్ రావు వ్యాఖ్యానించారు.

**స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం**

ఈ పరిస్థితుల్లో మీడియా సంస్థలు తమ ప్రతినిధులకు సరైన శిక్షణతో పాటు, నైతిక ప్రమాణాలను పాటించేలా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.



**పార్వతి రాజేష్ కుమార్**
ఎడిటర్ : "మన సమాజం" డిజిటల్ డైలీ
సీఈఓ : "C4"న్యూస్

చట్టపరమైన వ్యవస్థలను గౌరవించడం, విచారణ ప్రక్రియలో మౌలిక హక్కులు కాపాడటం జర్నలిస్టుల బాధ్యత.

**మూల్యాలపై పునఃపరిశీలన అవసరం**

పత్రికా రంగం లోపలే ఈ విధమైన చర్చలు జరగడం సానుకూల పరిణామం. పత్రికా రంగానికి చెందిన వారు తమ విలువలు, పని తీరును పునఃపరిశీలించాల్సిన సమయం ఇది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలంటే, జర్నలిజం నిబద్ధత మరియు నైతికత కీలకం అవుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ప్రభుత్వ విద్యార్థి భవిష్యత్తుకు భరోసా కావాలి

ప్రభుత్వ బడుల పనితీరుపై ఈ మధ్యకాలంలో సీఎం నుంచి సామాన్య పౌరుడి వరకు చాలా విస్తృతంగా చర్చ నడుస్తోంది. ఇదొక శుభపరిణామం. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కొందరు డిమాండ్ చేస్తుండగా.. ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపితే తాము కూడా తమ పిల్లలను పంపేందుకు సిద్ధమన్నది ఆయా ఉపాధ్యాయులు చెప్పే మాట. ప్రభుత్వ విద్యలో నాణ్యతా ప్రమాణాలు, విద్యార్థుల సంఖ్యను పెంచడానికి చేపట్టాల్సిన చర్యల కోసం ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశం చివరకు వాగ్వివాదాలతో ముగిసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం 14 సంవత్సరాల లోపు బాల బాలికలకు అంతరాలు లేని నిర్బంధ ఉచిత విద్యను అందించే బాధ్యత ప్రభుత్వాల విధి. అయినా పేద పిల్లలకు నాణ్యమైన విద్య ఒక అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నది. ఈ నేపథ్యంలో, రోజురోజుకూ సమాజంలో సామాజిక, ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి. ధనవంతులు మరింత ధనవంతులుగా పేదవారు మరింత పేదవారుగా మారుతున్నారు. ఈ విషవలయాన్ని ఛేదించేది ఒక్క చదువు మాత్రమేనని డా. బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టినా ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. ఒకప్పుడు దాదాపు తొంభై ఐదు శాతానికి పైగా విద్యార్థులకు విద్యనందించిన ప్రభుత్వ పాఠశాలలు నేడు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో 2014%-%15లో 57.19 శాతం మంది విద్యార్థులు ఉండగా 2024%-%25 నాటికి 73.50 శాతానికి పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం 42.81 శాతం నుంచి 26.50 శాతానికి పడిపోయింది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో తగినంత విద్యార్థుల సంఖ్య లేదని చెబుతూ 2009, 2011, 2015 సంవత్సరాల్లో రేషనలైజేషన్ పేరుతో వేలాది గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారు. 2020 జాతీయ విద్యావిధానం ప్రకారం విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి 35:1గా ఉండాలి. కానీ దేశంలోనే అత్యంత కనిష్టంగా మన యూపీఎస్ పాఠశాలల్లో ఈ నిష్పత్తి 13:1 ఉండగా ఉన్నత పాఠశాలల్లో 9:1గా ఉంది. అయినా మరో డీఎస్సీ నిర్వహణ ప్రభుత్వ పరిశీలనలో ఉంది! ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడానికి బడిబాట, మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల లాంటి కార్యక్రమాలు ఎన్ని చేపట్టినా అడ్మిషన్లు తగ్గుతూనే వస్తున్నాయి. అర్హతలేని వ్యక్తులతో బోధన చేయిస్తున్నా, ఫీజులు భారమైనప్పటికీ తక్కువ స్థాయి, మధ్యతరగతి నుంచి సంపన్నవర్గ తల్లిదండ్రుల వరకు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకే పంపుతున్నారు. తమ పిల్లలను ఇంటర్మీడియట్ వరకు ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివించిన తల్లిదండ్రులు.. వృత్తి విద్యలైన మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సుల్లో మాత్రం ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్ కోసం చూస్తున్నారు. సహజంగానే ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులతో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు పోటీపడలేక, వృత్తి విద్య కోర్సుల్లో, ఉద్యోగాల్లో అవకాశాలు రావడం లేదు. ఫలితంగా పేదవారు ఉన్నత విద్యకు, ఉపాధికి దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవాన్ని గ్రహించాలి. అడ్మిషన్ల లేమితో ప్రాభవం కోల్పోతున్న ప్రభుత్వ పాఠశాలలకు ఉద్దీపన చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ బడిలో చదివే పిల్లలకు కళ చెదిరే రంగులతో ఆధునిక భవనాలు కాదు వృత్తివిద్య ఉద్యోగ భరోసా కావాలి. ఒకటి నుంచి పన్నెండో తరగతి వరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివిన విద్యార్థులకు ప్రభుత్వ వృత్తి విద్యా, ప్రభుత్వ ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం ప్రత్యేక రిజర్వేషన్ కోటా కల్పించాలి. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి ప్రచారం లేకున్నా ఊహకు అందనన్ని అడ్మిషన్లు పెరుగుతాయి. క్రమంగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, బాధ్యతాయుతమైన బోధన, మూల్యాంకనం జరిగి ఒక నూతన సమాజ నిర్మాణానికి బాటలు ఏర్పడతాయి. రాజకీయ పార్టీల మేనిఫెస్టోల్లో ప్రధాన అంశంగా చోటు దక్కి, ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం వస్తుంది. ప్రభుత్వ పాఠశాలలు సమాజ విశ్వాసం కోల్పోతున్న సందర్భంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠం చేయాలనే ప్రగతిశీల ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో, టీచర్ల నియమకాలతో పాటుగా ప్రభుత్వ బడిలో చదివే పిల్లలకు ప్రభుత్వ వృత్తివిద్య కాలేజీల ప్రవేశాల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించే చట్టం చేయడానికి పూనుకోవాలి. అలా కాపాడగలిగితే ప్రభుత్వ విద్యా పరిరక్షణ పితామహుడిగా రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలవడం ఖాయం.

## చర్లలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పర్యటన

**చర్ల,మే 07 :** చర్ల మండలంలో బుధవారం రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పర్యటించారు.ఈ సందర్భగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నేనిరుపేదలందరికీ పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకు రాష్ట్రం మొత్తం పూర్తిస్థాయిలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చర్ల మండలంలోని సుబ్బంపేట గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారులు ఎస్ టి కోయ తెగకు చెందిన వాసం ముసలయ్య కుటుంబ సభ్యులతో కలిసి సన్న బియ్యంతో తయారుచేసిన వంటకాలను ఆయన చవి చూశారు. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు తన ఇంట్లో భోజనానికి రావడంతో ఆ కుటుంబానికి మరియు ఆ గ్రామంలోని ప్రజల ఆనందానికి అవధులు లేవని తమ గ్రామంలోని నిరుపేదలైన గిరిజన కుటుంబంలో భోజనం చేయడానికి వచ్చిన ఆయనకు సన్న బియ్యం తో పాటు పాయసం, పులిహోర, సేంద్రీయ ఎరువులతో పండించిన తోటకూర పప్పు, గోంగూర చట్నీ మరియు ఇతర ఆహార పదార్థాలను వడ్డించారు. మంత్రివర్యులు సంతోషంగా తనివి తీర భోజనము చేసిన తర్వాత కుటుంబ సభ్యులను అభినందించి ఆయన మాట్లాడుతూ నిరుపేదలందరికీ ఆహార భద్రత కల్పించేలా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ఉగాది పండుగ నుంచి ప్రారంభించామని సన్న బియ్యం పంపిణీ వలన ప్రజల నుండి మంచి స్పందన వస్తుందని, చరిత్రరాత్మకమైన ఘట్టంలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నామని, 80 శాతానికి పైచిలుకు బడుగు బలహీన, దళిత, గిరిజన, మైనార్టీ నిరుపేద ప్రజలు లబ్ధి పొందుతున్నారని అని అన్నారు . అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఇర్పా శాంతా గత కొంత కాలంగా అనారోగ్యానంతో ఉండగా వారిని మంత్రివర్యులు పరమార్శించారు.

# కశ్మీర్‌లో పాక్ కాల్పులు..

## 15 మంది పౌరుల మృతి, 43 మందికి గాయాలు..

**న్యూఢిల్లీ, మే 7 :**
జమ్మూ కశ్మీర్‌లో లైన్ ఆఫ్ కంట్రోల్ అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పాకిస్తాన్ బుధవారం షెల్లింగ్ దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో 15 మంది భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోగా, మరో 43 మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్తాన్ దాడులకు ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరిట బుధవారం తెల్లవారుజామున 1:05 గంటలకు పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని 25 నిమిషాల పాటు ఖచ్చితమైన దాడులు చేసింది. ఈ దాడులు జైష్-ఏ-మహమ్మద్, లష్కర్-ఏ-తొయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ సహా పలు ఉగ్రసంస్థల శిబిరాలపై జరిగాయి.

**పాక్ దాడులతో కశ్మీర్‌లో విధ్వంసం**
పాకిస్తాన్, పీఓకెలోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు ప్రారంభించిన కొన్ని గంటల తర్వాత ఈ దాడులు జరగడం విశేషం. పాకిస్తాన్ భారీ షెల్లింగ్ దాడుల కారణంగా జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్, తంగ్ధర్ ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ దాడుల్లో %వాశీజ, ×దీ% వెంబడి ఉన్న గ్రామాల్లోని ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. శిథిలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కిటికీల సమీపంలో గాజు శకలాలు చిందరవందరగా కనిపించాయి. ఈ దాడుల్లో సామాన్య పౌరులు తీవ్రంగా నష్టపోయారు.

**పాక్ దళాలు**
ప్రధానంగా పూంచ్ జిల్లాలోని సెంట్రల్ గురుద్వారా శ్రీగురు సింగ్ సభా సాహిబ్‌పై పాక్ దళాలు జరిపిన దాడిలో ముగ్గురు గురుసిఖ్‌లు మరణించారు. శిరోమణి అకాలీ దళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ఈ ఘటనపై లో




స్పందిస్తూ, మరణించిన వారిలో భాయ్ అమ్రీక్ సింగ్ జీ (రాగీ సింగ్), భాయ్ అమర్‌జీత్ సింగ్, భాయ్ రంజిత్ సింగ్ ఉన్నారని తెలిపారు. శిరోమణి అకాలీ దళ్ మరణించిన గురుసిఖ్‌ల కుటుంబాలకు పూర్తి సంఘీభావాన్ని తెలియజేసింది. ఈ బాధాకర సమయంలో బాధిత కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని, వీరి త్యాగాన్ని గౌరవించాలని డిమాండ్ చేసింది.

**పౌరుల భద్రతకు ప్రాధాన్యం**
మరోవైపు ఆపరేషన్ సింధూర్ పేరుతో కాల్పులు కొనసాగిన నేపథ్యంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమీపంలోని పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఇప్పటికే ఆదేశించారు. ఆయన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ దల్జిత్ సింగ్ చౌధరి, జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాతో ఫోన్ ద్వారా నిరంతరం సంప్రదించారు. పౌరుల భద్రత భారత్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని షా అధికారులకు స్పష్టం చేశారు. అయినప్పటికీ పౌరులు మరణించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# అమాయక పౌరులను చంపిన వారినే మట్టుబెట్టాం.. రక్షణ మంత్రి

**న్యూఢిల్లీ, మే 7 :**
న్యూఢిల్లీ: ఆపరేషన్ సింధూర్‌తో పహల్గాం ఉగ్రదాడిలో టూరిస్టులను అత్యంత కిరాతకంగా చంపిన వారికి గట్టి సమాధానమిచ్చామని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మన అమాయక పౌరులను చంపిన వారినే మట్టుబెట్టామని, సాధారణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అత్యంత జాగరూకతతో ఈ దాడులు నిర్వహించామని చెప్పారు. మన సైనికులు అద్భుత పరాక్రమం ప్రదర్శించారని కొనియాడారు. 6 రాష్ట్రలు, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ చేపట్టిన 50 మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను రాజ్‌నాథ్ సింగ్ బుధవారంనాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలను టార్గెట్ చేసుకుని సాయుధ బలగాలు విజయవంతంగా ఈ ఆపరేషన్ నిర్వహించారని అభినందించారు. పహల్గాంలో ఉగ్రవాదులు 25 మంది టూరిస్టులు, ఒక కశ్మీర్ పోనీ రైడ్ ఆపరేటర్‌ను అత్యంత పాశవికంగా




హత్య చేశారని, ఇందుకు ప్రతిగా ఉగ్రవాదులపై దాడి చేసే హక్కును భారత్ సమర్థవంతంగా ఉపయోగించుకుందని రాజ్‌నాథ్ చెప్పారు. భారత సాయుధ బలగాలు చరిత్రను తిరగరాశాయని అన్నారు. సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. రామాయణంలో రావణాసురుడు సీతమ్మ వారిని నిర్బంధించిన అశోకవనాన్ని హనుమంతుడు నాశనం చేశాడని, అదే స్ఫూర్తితో భారత్ ప్రతిదాడి జరిపిందని ఉదహరించారు. "మన అమాయక పౌరులను ఎవరైతే చంపారో వారిని మాత్రమే మనం చంపాం" అని రాజ్‌నాథ్ పేర్కొన్నారు."ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మన బలగాలు ఆపరేషన్ సిందూర్ నిర్వహించి ఉగ్రవాద శిక్షణా శిబిరాలను ధ్వంసం చేశాయి. గట్టి బదులిచ్చాయి. కచ్చితమైన ప్రణాళికతో ఇదంతా చేశాం. ఉగ్రవాదుల నైతికస్థైరాన్ని దెబ్బతీశాం. ఈ దాడులను ఉగ్రవాద శిబిరాలు, మౌలిక వసులకే పరిమితం చేశాం. మన సాయుధ బలగాల ధైర్యసాహసాలకు సెల్యూట్ చేస్తున్నాను" అని రాజ్‌నాథ్ అన్నారు.

# జైషే మహ్మాద్ చీఫ్ మసూద్‌కు భారీ షాక్

**న్యూఢిల్లీ, మే 7 :** ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ పాక్ ఉగ్రస్థావరాలపై నిర్వహించిన మెరుపు దాడుల్లో పదుల సంఖ్యలో మరణించారు. అయితే, ఈ దాడుల్లో జైషే మహ్మాద్ చీఫ్ అజర్ మసూద్ కుటుంబసభ్యులు కూడా మరణించినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. బహావల్‌పూర్‌లో జరిగిన దాడిలో మజూర్ సోదరితో పాటు ఐక్యరాజ్యసమితి ఉగ్రవాదిగా ప్రకటించిన మరో బంధువుతో సహా మొత్తం 10 మంది కుటుంబసభ్యులు బాంబు ధాటికి మరణించారు. బుధవారం భారత దళాలు పాక్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లోగల ఉగ్రస్థావరాలను టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. జైషే మహ్మాద్, లష్కరే తోయిబాప్రధాన కార్యాలయాలున్న ప్రాంతాల్లోనే ఈ దాడులు జరిగాయి. ఉగ్రవాదుల స్థావరాలనే తాము టార్గెట్ చేసుకున్నామని భారత్ స్పష్టం చేసింది. సామాన్యులకు అపాయం కలుగకుండా ఆపరేషన్ నిర్వహించినట్టు వెల్లడించింది. ఈ దాడిలో పాక్ ఉగ్రస్థావరాలపై భారత్ 25 నిమిషాలపాటు బాంబుల వర్షం కురిపించినట్టు తెలుస్తోంది. అత్యంత కచ్చితత్వంతో జరిపిన ఈ దాడుల్లో సుమారు 70 మంది ఉగ్రవాదులు అంతమయ్యారు. పీఓకే ఉగ్రస్థావరాల తోపాటు పాక్‌లోని ఐదు ఉగ్రక్యాంపులను కూడా భారత్ ధ్వంసం చేసింది. కాగా, భారత్ చర్యలపై స్పందించిన పాక్.. ఈ ఆపరేషన్‌ను యుద్ధ చర్యగా అభివర్ణించింది. అయితే, భారత్ తన చర్యలను కట్టిపెడితే తాము ప్రతి దాడికి దిగబోమని కాళ్లబేరానికి వచ్చింది. ఇదిలా ఉంటే భారత్ కూడా పాక్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. పరిస్థితి మరింత దిగజార్చేలా దాడులకు దిగితే గట్టిగా బదులిస్తామనని వార్నింగ్ ఇచ్చింది. ఈ సందర్భంగా ప్రపంచ దేశాలు భారత్‌కు అండగా నిలిచాయి. స్వీయ రక్షణ భారత దేశ హక్కు అని ముక్తకంఠంతో పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా తాము ఎలాంటి మిలిటరీ స్థావరాలను టార్గెట్ చేయలేదని పత్రికా సమావేశంలో భారత



ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ పేర్కొన్నారు. అయితే, పాక్ చేపట్టే ఎలాంటి దుందుడుకు చర్యలకైనా తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కచ్చితమైన నిఘా సమాచారంతో తాము ఈ లక్ష్యాలను ఎంచుకున్నామని అన్నారు.

# ఉగ్రచర్యలను భారత్ ఉపేక్షించదు..

న్యూఢిల్లీ: ఉగ్రచర్యలను భారత్ ఉపేక్షించదని, పాక్‌లో ఉగ్రసంస్థలు ఉన్నాయని 2023లోనే ఐక్యరాజ్య సమితి దృష్టికి తీసుకెళ్లామని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం ఆయన ఢిల్లీ లో మీడియాతో మాట్లాడుతూ.. సీమాంతర ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ ప్రోత్సహిస్తూనే ఉందని, భారత్ చేసిన దాడి బాధ్యతాయుతమైనదని, దాడులకు పాల్పడేవారిని కచ్చితంగా శిక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. పాకిస్తాన్‌లోని 9 ఉగ్ర శిబిరాలపై భారత్ సేనలు దాడి చేశాయని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ఉగ్రవాదాన్ని అరికట్టడంలో ఐక్యరాజ్య సమితి విఫలమైందని, అనేది లష్కరే తొయిబాకు ఒక ముసుగు అని విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. ఉగ్రదాడులకు పాల్పడ్డవారిని నిఘా వ్యవస్థల ద్వారా గుర్తించామన్నారు. ఉగ్రసంస్థల కోసమే పనిచేస్తోందని, అంతర్జాతీయ వేదికలపై ప్రపంచ దేశాలను పాక్ తప్పుదారి పట్టిస్తోందని ఆయన మండిపడ్డారు. ఉగ్రవాదానికి పాకిస్థాన్ స్వర్గధామంగా మారిందన్నారు.



**అందుకే సరైనరీతిలో బుద్ధిచెప్పాం..**
భారత్‌పై ఉగ్రదాడి జరిగే అవకాశం ఉందని... నిఘా వర్గాలు హెచ్చరించాయని విక్రమ్ మిస్రీ అన్నారు. ఉగ్రసంస్థల మౌలిక వసతులు ధ్వంసం చేసేందుకే సరిహద్దు దాటి భారత్ దాడి చేసిందన్నారు. పహల్గామ్ దాడి తర్వాత పాక్ దిద్దుబాటు చర్యలు చేపట్టలేదని, భారత్ తన అధికారాన్ని ఉపయోగించి.. ఆపరేషన్ సింధూర్ చేపట్టిందని స్పష్టం చేశారు. పహల్గామ్ దాడిలో మరో కుట్ర ఉందని, కశ్మీర్‌తో సహా దేశంలో విద్వేషాలు రెచ్చగొట్టాలని చూశారన్నారు. కశ్మీర్‌ను గతేడాది 2.3 కోట్ల మంది పర్యాటకులు సందర్శించారని, జమ్మూ కశ్మీర్ పర్యాటకంగా, ఆర్థికంగా వృద్ధి చెందుతోందన్నారు. పహల్గామ్ దాడితో ఇదంతా దెబ్బతీయాలని చూశారని, అందుకే సరైనరీతిలో బుద్ధిచెప్పామని విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. కాగా పహల్గామ్ మృతులకు న్యాయం చేసేందుకే.. 'ఆపరేషన్ సింధూర్' చేపట్టామని కల్నల్ సోఫియా ఖురేషి చెప్పారు. గత 30 ఏళ్లుగా ఉగ్రమూకలకు పాక్ సౌకర్యాలు కల్పిస్తోందని ఆరోపించారు. పాక్‌లోని 9 ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేశామన్నారు.


# మావోలకు గట్టి షాక్



**ఛత్తీస్‌గఢ్, మే 7:** మావోయిస్టులకు మరోసారి భారీ ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టులను అంతమొందించడమే లక్ష్యంగా ఆపరేషన్ కర్రెగుట్టలు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఈరోజు (బుధవారం) ఉదయం తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టలపై భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ పరిధిలో భద్రతా బలగాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో 20 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలం నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ప్రస్తుతం భద్రతా బలగాలకు మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. కాగా.. నిన్న కూడా కర్రెగుట్టలపై ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ కాల్పుల్లో ఓ మహిళా మావోయిస్టు మృతి చెందారు. 303-రైఫిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఇప్పటి వరకు నలుగురు మహిళా నక్సలైట్లు చనిపోయారని, వందల సంఖ్యలో మావోయిస్టుల స్థావరాలు, బంకర్లను ధ్వంసం చేశామని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. మావోయిస్టులను ఏరివేసేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలను జల్లెడపడుతున్నాయి. బీఎస్ఎఫ్, ఎస్‌టీఎఫ్, డీఆర్‌జీ బలగాలు ఆ ప్రాంతాన్ని సెర్చ్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా ఐఈడీ పేలింది. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లు గాయపడటంతో వెంటనే శిబిరానికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స అనంతరం హెలికాప్టర్‌లో బీజాపూర్ ఆస్పత్రికి తరలించారు. అంతకు ముందు కూడా ఐఈడీ పేలడంతో ఇద్దరు జవాన్లు గాయపడిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఆపరేషన్ కర్రెగుట్టల్లో దాదాపు 200 ఐఈడీలను భద్రతా బలగాలు నిర్వీర్యం చేసిన విషయం తెలిసిందే. మావోయిస్టు పార్టీ నిర్మూలనే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌తో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అంతా వార్‌జోన్‌గా మారింది. దాదాపు 15 రోజులుగా కర్రెగుట్టల్లో మావోయిస్టుల కోసం వేట కొనసాగుతోంది. ఇప్పటికే వందలాది మావోయిస్టుల రహస్య స్థావరాలు, బంకర్‌లను గుర్తించారు. మావోయిస్టుల స్థావరాల నుంచి వేల కిలోల పేలుడు పదార్థాలు, నిత్యావసర వస్తువులు, డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం కర్రెగుట్టల్లో మావోయిస్టుల కోసం సెర్చ్ కొనసాగుతూనే ఉంది.

# భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలి

**అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం ఆదేశాలు**



**హైదరాబాద్:** తెలంగాణలో భద్రతా పరిస్థితులను బలోపేతం చేయడంలో భాగంగా, ఆపరేషన్ సిందూర్, మాక్ డ్రిల్ అనంతరం ఏర్పడిన పరిస్థితులపై ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రాష్ట్ర భద్రతా యంత్రాంగం సంసిద్ధతను పరిశీలించి, ముందస్తు చర్యలపై అధికారులకు కీలక సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమాలు రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరోధించడానికి, ప్రజలకు భద్రతపై అవగాహన కల్పించడానికి ఉద్దేశించినవి.

**కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు..**
సమీక్ష సమావేశంలో, రాష్ట్రంలో భద్రతా ఏర్పాట్లను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఆర్మీ, నేవీ కార్యాలయాలు, రక్షణ రంగ సంస్థలు, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, విదేశీ రాయబార కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలో పర్యటిస్తున్న విదేశీ పర్యాటకులకు తగిన రక్షణ కల్పించాలని, కేంద్ర నిఘా బృందాలతో రాష్ట్ర నిఘా బృందాలు సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

**సెలవులు బంద్..**
ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "హైదరాబాద్ నగరం దేశ రక్షణ పరంగా వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతం. ఈ నేపథ్యంలో, రాష్ట్ర యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. ఐటీ సంస్థలు, విమానాశ్రయం, రక్షణ సంస్థల వద్ద భద్రతను పెంచాలి. అత్యవసర సర్వీసులు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులను రద్దు చేసుకుని, సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**అన్ని శాఖల సమన్వయం..**
సమీక్ష సమావేశంలో, అన్ని శాఖలు పూర్తి సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం ఆదేశించారు. నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడకుండా సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని, అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను కేంద్రంగా సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి, నిరంతర నిఘా, పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

**వెంటనే చర్యలు..**
రాష్ట్ర ప్రభుత్వం ఈ సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయడానికి చర్యలు చేపట్టింది. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎస్, డీజీపీ, స్థానిక మిలటరీ అధికారులు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సాయంత్రం జరిగిన మాక్ డ్రిల్‌ను స్వయంగా పర్యవేక్షించి, రాష్ట్ర యంత్రాంగం సంసిద్ధతను సమీక్షించారు.



# రవితేజ హీరోయిన్‌తో రామ్ డేటింగా..



మాస్ మహరాజా రవితేజ హీరోయిన్ భాగ్య శ్రీ భోర్సే గురించి తెలుగు ప్రేక్షకులకి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్ అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులని పలకరించింది ఈ చిన్నది. మరాఠి బ్యూటీ భాగ్యశ్రీ భోర్సే కి తొలి సినిమా భారీ డిజాస్టర్ అయినా అమ్మడు మాత్రం ఓవర్‌నైట్ స్టార్ అయింది. దాంతో ఒక్కసారిగా అవకాశాలు వెల్లువలా వస్తున్నాయి. ప్రస్తుతం విజయ్ దేవరకొండ నటిస్తున్నకింగ్ డమ్ , దుల్కర్ సల్మాన్ కాంబినేషన్‌లో రూపొందుతున్న కాంత వంటి చిత్రాల్లోనూ నటిస్తున్నారు. దీంతో పాటు మరో రెండు చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి.ఒకవైపు తన గ్లామర్ తో , మరోవైపు డేటింగ్ రూమర్స్ తో భాగ్యశ్రీ ఎప్పటికప్పుడు హాట్ టాపిక్ అవుతూ ఉంటుంది. గత కొద్ది రోజులుగా భాగ్య శ్రీ బోర్సే, రామ్ డేటింగ్‌లో ఉన్నారంటూ అనేక ప్రచారాలు జరుగుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. వీరిద్దరూ రాపో 22 సినిమాలో నటిస్తున్నారు. షూటింగ్ సమయంలో వీరి మధ్య ప్రేమ చిగురించిందని అనేక ప్రచారాలు జరుగుతున్నా దానిపై క్లారిటీ లేదు. తాజాగా రామ్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా రాపో 22 సినిమాలో భాగ్య శ్రీ ఫోటోని షేర్ చేస్తూ.. హ్యాపీ బర్త్ డే ! ఈ ఏడాది నీకు ప్రేమ, విజయాలు, సంతోషం దక్కుతాయని ఆశిస్తున్నా. అందుకు నువ్వు అర్హురాలివి. అని రామ్ పోస్ట్ చేశారు .

# న్యూ బిగినింగ్స్ అంటూ అతడి ఫొటో షేర్ చేసిన సమంత

టాలీవుడ్ స్టార్ హీరో సమంత కొన్ని సంవత్సరాల క్రితం నాగ చైతన్య నుండి విడిపోయిన సంగతి తెలిసిందే. ఎంతో అన్యోన్యంగా ఉన్న ఈ జంట ఎవరు ఊహించని విధంగా విడిపోయారు. విడాకుల తర్వాత నాగ చైతన్య రెండో పెళ్లి చేసుకున్నా సమంత మాత్రం సింగిల్‌గా ఉంటుంది. ఆ మధ్య మయోసైటిస్ బారిన పడ్డ సమంత సినిమాలకి కూడా బ్రేక్ ఇచ్చింది. ఇక ఇప్పుడు తిరిగి సినిమాలు చేస్తుంది. సమంత నిర్మాతగా కూడా యాక్టివ్ అవుతోంది. సమంత తన సొంత బ్యానర్ ట్రాలాల మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ లో శుభం చిత్రం నిర్మించగా, ఈ చిత్రం మే 9న రిలీజ్ కి రెడీ అవుతోంది. గత కొద్ది రోజులుగా ఈ మూవీ ప్రమోషన్ కార్యక్రమాలలో యాక్టివ్‌గా ఉంటూ ఆసక్తికర విషయాలు పంచుకుంటుంది. రీసెంట్‌గా జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లోను సమంత పాల్గొంది. అయితే తాజాగా సమంత తన ఇన్‌స్టాలో కొన్ని ఆసక్తికర ఫొటోలు పంచుకుంది. దానికి కామెంట్‌గా చాలా పెద్దదారే దాటి కానీ ఈసారి బలంగా తయారయ్యాను.. ఇక కొత్త ప్రయాణం మొదలైంది.. అంటూ చివరిగా శుభం సినిమా రిలీజ్ డేట్ పెట్టి ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ షేర్ చేసింది . అయితే సమంత షేర్ చేసిన ఒక ఫొటోలో ఆమె దర్శకుడు రాజ్ తో కనిపించింది.. గత కొద్దిరోజులుగా వీరిద్దరూ త్వరలో పెళ్లి చేసుకుంటారు అన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో సమంత అతనితో ఉన్న ఫొటోలు షేర్ చేయడం అందరిలో అనేక అనుమానాలు కలిగిస్తుంది. కొంతకాలంగా సమంత.. రాజ్ నిడిమోరుతో డేటింగ్ లో ఉన్నట్లు తెగ ప్రచారం నడుస్తుంది. కొన్ని సందర్భాల్లో వీరిద్దరూ జంటగా కూడా కనిపించారు. రాజ్ నిడిమోరు ఫ్యామిలీ మ్యాన్ సిరీస్ దర్శకుల్లో రాజ్ ఒకరు. ఫ్యామిలీ మ్యాన్ 2లో సమంత విలన్ గా నటించింది. అదే విధంగా రాజ్ తెరకెక్కించిన హనీ బనీ వెబ్ సిరీస్ లో కూడా నటించింది. ఆ సమయంలో వీరి మధ్య పరిచయం మొదలై అది ప్రేమగా మారిందని అంటున్నారు. మరి వీరి రిలేషన్ ఏంటనే దానిపై ఇప్పటి వరకు క్లారిటీ లేదు.

# మెట్ గాలాలో షారుఖ్ మెరుపులు..

## స్పెషల్ ట్రిబ్యూట్ ఇచ్చిన అమూల్

బాలీవుడ్ సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్ ఇటీవల మెట్ గాలా వేడుకలో సందడి చేసిన విషయం తెలిసిందే. ఈ వేడుకకు హాజరైన తొలి భారతీయుడిగా షారుఖ్ రికార్డు సృష్టించాడు. అయితే షారుఖ్ మెట్ గాలాలో చేసిన సందడిపై ప్రముఖ డెయిరీ బ్రాండ్ అమూల్ తనదైన శైలిలో స్పెషల్ ట్రిబ్యూట్ ఇచ్చింది. షారుఖ్‌ను ఇండియాస్ బిగ్గెస్ట్ గాలాకార్ అంటూ ప్రశంసిస్తూ ఒక ప్రత్యేక కార్టూన్‌ను రూపొందించింది. అమూల్ రూపొందించిన ఈ కార్టూన్‌లో షారుఖ్ ఖాన్ మెట్ గాలా వేదికపై ఆకర్షణీయంగా నిలబడి ఉండగా, అమూల్ గర్ల్ ఆయనకు వెన్నతో తయారు చేసిన టోపీని అందిస్తున్నట్లుగా చిత్రీకరించారు. ఈ కార్టూన్‌ను అమూల్ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకుంది. ప్రస్తుత ట్రెండ్‌లో ఉన్న విషయాలతో పాటు ప్రముఖ వ్యక్తులపై అమూల్ ఎప్పటికప్పుడు తమదైన చమత్కారంతో కూడిన కార్టూన్‌లను రూపొందిస్తుంటుం ది. ఈసారి మెట్ గాలాలో షారుఖ్ ఖాన్ ప్రత్యేకంగా నిలవడంతో, అమూల్ ఆయనను తమ క్రియేటివ్ ప్రమోషన్‌లో భాగం చేసింది. షారుఖ్ ఖాన్ అభిమానులు ఈ కార్టూన్‌ను విశేషంగా ఆదరిస్తున్నారు. తమ అభిమాన నటుడిని అమూల్ గౌరవించిన తీరు వారికి ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. ఈ కార్టూన్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా, మెట్ గాలా అనేది ప్రతి సంవత్సరం న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం



ఆఫ్ ఆర్ట్‌లో జరిగే ఒక ప్రతిష్టాత్మక ఫ్యాషన్ వేడుక. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రముఖులు, ఫ్యాషన్ డిజైనర్లు ఈ వేడుకకు హాజరవుతారు. ఈ ఏడాది జరిగిన మెట్ గాలాలో షారుఖ్ ఖాన్ తన ప్రత్యేక శైలితో అందరి దృష్టిని ఆకర్షించారు.



# బుచ్చిబాబు నెక్స్ట్ సినిమా కూడా ఫిక్స్ అయిందా..

సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు తన తొలి సినిమాగా ఉప్పెన అనే చిత్రం చేశాడు. ఈ చిత్రం ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ ఉప్పెన చిత్రంతో బుచ్చిబాబు టాలెంట్ ఏంటో అందరికి అర్థమైంది. చెర్రీ కూడా బుచ్చిబాబు పనితీరుకి ఫిదా అయి ఆయనతో కలిసి ఇప్పుడు పెద్ది అనే చిత్రం చేస్తున్నాడు. ఇటీవల ఈ మూవీ గ్లింప్స్ విడుదల కాగా, ఇది చూసి అంతా అవాక్కయ్యారు. గ్లింప్స్‌తోనే అందరి దృష్టినీ తన వైపు తిప్పుకొన్నాడు. పెద్ది సినిమాతో బుచ్చిబాబు పెద్ద బ్లాక్ బస్టర్ హిట్ తన ఖాతాలో వేసుకోవడం ఖాయం అంటున్నారు.

ఇక బుచ్చి. 'పెద్ది' తరవాత బుచ్చి ఏం చేయబోతున్నాడు? అనే చర్చ కూడా నడుస్తుంది. ఈ క్రమంలో 'పెద్ది' అయ్యాక మహేష్ బాబుతో బుచ్చిబాబు ఓ సినిమా చేసే అవకాశాలు ఉన్నాయని ఫిలిం నగర్‌లో జోరుగా చర్చ నడుస్తుంది. గతంలో బుచ్చిబాబు.. మహేష్ నటించిన వన్ సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాడు. ఆ సమయంలో మహేష్ బాబుతో మంచి సాన్నిహిత్యం ఏర్పడిందట. ఈ క్రమంలో ఉప్పెన తర్వాత ఓ సారి మహేష్ బాబుని కలిసాడట. అప్పుడు మహేష్ బాబు.. 'మంచి కథ ఉంటే చెప్పు, చేద్దాం' అని మాట ఇచ్చాడట. దాంతో మహేష్ కోసం మంచి కథ సిద్ధం చేసే పనిలో బుచ్చి ఉన్నట్టు తెలుస్తుంది. మహేష్ కోసం బుచ్చిబాబు యాక్షన్ డ్రామా సిద్ధం చేసుకుంటున్నాడని, ఇందులో మహేష్‌ని నెక్ట్స్ లెవల్‌లో చూపించే ప్రయత్నాల్లో బుచ్చిబాబు ఉన్నాడని ఫిల్మ్‌నగర్ టాక్.ఇక బుచ్చిబాబు ప్రస్తుతం చేస్తున్న పెద్ది చిత్రం రియల్ ఇన్సిడెంట్స్ ఆధారంగా రాసుకున్న ఫిక్షనల్ స్టోరీ అని అంటున్నారు. కోవిడ్ టైమ్‌లోనే ఈ కథ రెడీ చేసుకున్నానని చెప్పిన బుచ్చిబాబు సుకుమార్ వల్లే రామ్ చరణ్‌కు కథ వినిపించే ఛాన్స్ వచ్చిందని అన్నారు.

ఇక టీజర్‌లో సూపర్ సక్సెస్ అయిన క్రికెట్ షాట్ ..ఫైట్ మాస్టర్ నవకాంత్ డిజైన్ చేశారని, క్రెడిట్ అంతా అతనికే దక్కాలన్నారు. రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. నిజానికి 'పెద్ది' ఐడియా ముందుగా ఎన్టీఆర్‌కే చెప్పాడు బుచ్చిబాబు. కాని ఎందుకో కుదరలేదు.